www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 సెప్టెంబర్ 2025
5
చిత్తూరు



అర్హులైనా అందని పెన్షన్

- రీ వెరిఫికేషన్ అంటూ రెండోసారీ నోటీసులు
- అంగవైకల్యం శాతం తగ్గించి కోతలు
- అవమానిస్తున్నారంటూ దివ్యాంగుల ఆవేదన



రీ వెరిఫికేషన్ పేరిట ఫించన్ కోతలను నిరశిస్తూ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

2016లో వికలాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టాన్ని నీరుగార్చేలా కూటమి ప్రభుత్వం సదరం రీ వెరిఫికేషన్ పేరిట అంగవైకల్యం శాతాన్ని తగ్గించి పింఛన్‌లో కోత విధిస్తోంది. వందశాతం వికలత్వం ఉన్న వారికి సైతం ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు నెలకు రూ.15వేలు పింఛన్‌లో కోతలు విధించడంతో పాటు తగ్గించే ప్రయత్నం చేస్తోంది.

2010లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం అంగవైకల్యం నిర్ధారించేలా సదరం క్యాంపులు నిర్వహించింది. 40 నిమిషాల పాటు ప్రతి వికలాంగుడికి వైద్యపరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికేట్లు మంజూరు చేసింది. అయితే గత వైసిపి ప్రభుత్వంలో అవకతవకలు చోటు చేసుకున్నాయి అంటూ ఆరోపిస్తున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 2019 నుండీ సదరం సర్టిఫికేట్లు పొందిన వారి సదరం సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేస్తే సరిపోతుంది. కానీ 2016 నుండీ పొందిన సదరం సర్టిఫికేట్లను రీ వెరిఫికేషన్‌కు పూనుకోవడం, వైద్యుల నిర్లక్ష్యం ఫలితంగా అనేక మంది అర్హులను అనర్హులు తెల్చడంతో అనేక మంది అనర్హులుగా ఇప్పటివరకు పొందుతున్న పింఛన్‌లో కోత, పింఛన్ తగ్గించడం వంటి చర్యలతో దివ్యాంగులను ఆందోళనకు గురి చేస్తోంది.

గతంలో 90 శాతం అంగవైకల్యం ఉన్న వారికి ప్రస్తుత రీ వెరిఫికేషన్‌లో 40 నుంచి 50 శాతం మాత్రమే చూపుతుండటంతో అనేక మంది దివ్యాంగులు ఇబ్బందులకు గురౌతున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట దివ్యాంగులను అవమానిస్తున్నారంటూ దివ్యాంగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు మండిపడుతున్నారు. ఇది దివ్యాంగులను అవమానించడం, అవహేళన చేయడమేనని అంటున్నారు. రీ వెరిఫికేషన్ వాస్తవికతకు దూరంగా అర్ధరహితంగా ఉందంటున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట అంగవైకల్యం శాతం తగ్గించి మంజూరు చేస్తున్న సదరం సర్టిఫికేట్ల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలైన పింఛన్, సబ్సిడీ రుణాలు, ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి రుణాలు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, సహాయ పరికరాలు వంటికి వాటికి అనర్హులుగా మారే ప్రమాదం ఉంది. వికలాంగులు సమాజంలో ఎవరిమీదా ఆధారపడకుండా గౌరవ ప్రదంగా బ్రతకడానికి ఫించన్ మంజురు చేస్తున్నట్లు చెబుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి దివ్యాంగులను గౌరవిస్తున్నట్లు ప్రసంగాలు చేస్తూ ప్రస్తుతం రీ వెరిఫికేషన్ పేరిట అర్హులను అనర్హులుగా ప్రకటించడం ఏమిటని పలువురు వికలాంగులు ప్రశ్నిస్తున్నారు.

రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారు..



ఐరాల మండలంకు చెందిన దినేష్ (19) పుట్టుకతో దివ్యాంగుడు. తల్లిదండ్రుల సాయం లేకుండా కదలేడు. వంద శాతం అంగవైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికేట్ ఉంది. నెలకు రూ.15 వేలు ఫించన్ మంజురు కావాల్సి ఉంది కానీ నెలకు రూ.6వేలు మాత్రమే పింఛన్‌గా ఇస్తున్నారు.

ఫింఛన్ లేదంటూ నోటీసు ఇచ్చారు..



బి.కొత్తకోట మండలం బాలేంద్ర గ్రామంకు చెందిన మురగేషన్‌కి 90 శాతం ఉన్నట్లు సదరం సర్టిఫికేట్ జారీ చేశారు. ప్రస్తుతం రీ వెరిఫికేషన్‌లో 85 శాతం అంగవైకల్యం చూపుతూ సర్టిఫికేట్ జారీ చేశారు. ఇతడికి నెలకు రూ. 15 వేలు ఫించన్ వచ్చేది. అయితే ఈ నెల నుంచి పింఛన్ రాదంటూ నోటిసు జారీ చేశారు.

కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త

- గ్రామస్తులను వెంటాడి వేధిస్తున్న గ్రామ సింహాలు



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలంలోని ఆయా ప్రాంతాల్లో కుక్కల సంతతి విపరీతంగా పెరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా వీటి సంతతి నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలో సుమారు 30 నుంచి 40 కుక్క కాటు కేసులు నమోదు కాగా ఒక పూతలపట్టు మండల కేంద్రంలో మాత్రమే రోజు రెండు నుంచి మూడు వరకు నమోదవుతున్నట్టు సమాచారం.

వారం రోజుల కితం పూతలపట్టు బజారు వీధిలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆరు కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో చోదకుడు తీవ్రంగా గాయాలు పాలయ్యాడు. ఇటువంటి ఘటనలు తరచూ చోటు చేసుకోవడంతో మండల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో అయితే నూతన వ్యక్తులు అడుగుపెట్టడానికి ఆందోళన చెందాల్సిన పరిస్థితి. జాతీయ రహదారిపై కూడా కార్లు ద్విచక్ర వాహనాల చోదకులను శునకాలు వెంటాడి గాయపరుస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా వాటి నియంత్రించేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూగజీవాలపై దాడి..

కొన్ని సమయాల్లో వీధుల్లో ఉన్న మూగజీవాలపై కూడా కుక్కలు దాడికి పాల్పడుతున్నాయి. మరీ ముఖ్యంగా వీధుల్లో ఉన్న పశువులను లక్ష్యగా చేసుకుంటున్నాయి. ఇటీవల ఎల్లంపల్లి గ్రామంలో సుమారు రూ.30 విలువ చేసే లేక దూడపై దాడి చేశాయి. దీంతో లేక దూడ మృతి చెందింది. ఇక ఇండ్ల వద్ద పెంచుకునే కోళ్ళు వీటికి ఆహారంగా మారుతున్నాయి. వీధి కుక్కలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి : కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం: ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. స్థానిక మండల కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై కడ పీడీకి 30 వినతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని సూచించారు. త్వరలోనే అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈ గురవారెడ్డి, తహశీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

రీచ్ 4 పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ



ప్రజాశక్తి - కుప్పం: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం రీచ్ 4 పనులను ఎమ్మెల్సీ శ్రీకాంత్, టిడిపి నేతలతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. కుప్పం కడ కార్యాలయం వద్ద నుండి క్రిష్ణగిరి సర్కిల్ వరకు అక్కడ నుండి టిడిపి కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో కుప్పం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని రోడ్డు విస్తరణకు అంగీకరించిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డును వెడల్పు చేసి డివైడర్లు బటర్ఫ్లై, లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజకుమార్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, జిమ్ దాము, జాకీర్, సోము శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాల మేరకు జిల్లాలోని వైద్యాధికారులకు సోమవారం నుంచి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహణపై మూడు రోజుల రీ ఓరియంటేషన్ వర్క్‌షాప్ శిక్షణ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ 13 ప్రాణాంతక వ్యాధులు చంటి బిడ్డలకు రాకుండా ముందే వ్యాధి నిరోధక టీకాలను డ్యూడేట్ ప్రకారం ఇప్పించినట్లయితే సంబంధిత వ్యాధులైన క్షయ, పోలియో, డిఫ్తీరియా, కంఠసర్పి, కక్కాయి దగ్గు, ధనుర్వతం, విరోచనాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, మెదడు వాపు వ్యాధి, ఆటలమ్మ, గవద బిల్లలు, రుబెల్ల, కంటి వ్యాధులు రాకుండా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కావున వైద్యాధికారులు 0 ఉంచి 5 సంవత్సరాల పిల్లలకు ఈ టీకాలు అన్నీ అందేటట్లు అవగాహన కనిపించాలని తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వ్యాక్సిన్ తయారైనప్పటి నుండి బిడ్డకు అందే వరకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ మౌనికస్టెపి తామస్ వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిఏఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ అనూష, వివిధ పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా సరఫరా చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు యూరియాను సకాలంలో అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యానికి వ్యతిరేకంగా సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి కే.శివారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 80శాతం మంది రైతులు వరి పంటపై ఆధారపడి ఉన్నారని ఖరీఫ్ సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షపాతి అని చెప్పుకొనే కూటమి ప్రభుత్వం రైతులకు పంటకు సకాలంలో యూరియా ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. కొంతమంది ఎరువులు దుకాణదారులు యజమానులు యూరియాను నిల్వ ఉంచి ధరలను పెంచి బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు చొరవ చూపి రైతులకు యూరియా సకాంలో పంపిణీ చేయాలన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి

కలెక్టరేట్ ఎదుట గ్రీన్ అంబాసిడర్‌ల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వ్యాప్తంగా పనిచేయు గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు 25 నెలలు పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రన్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య , ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, కార్మికులు పంచాయతీల్లో పారిశుద్ధ పనులు చేస్తున్నప్పటికీ గ్రామస్తులకు ఆరోగ్యపరంగా కాపాడుకుంటూ పనులు చేస్తున్నప్పటికీ ప్రతినెలా ఇచ్చే రూ.6000లు వేతనాన్ని కూడా పూర్తిస్థాయిలో ప్రభుత్వం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి దాసరి చంద్ర పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : కలెక్టర్

- పిజిఆర్ఎస్‌కు 343 వినతులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్‌యస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 343 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అలాగే జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వేశాఖకు సంబంధించి 241, పోలీసుశాఖ 19, పంచాయతీరాజ్ 5, వ్యవసాయ శాఖ 3, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ 2, విద్యాశాఖ 3, ఐసిడిఎస్ 4, డ్వామా 5, పౌర సరఫరాల శాఖ 4, డిఆర్‌డిఏ 24, ఆర్ అండ్ బి 1, విద్యుత్ శాఖ 3, సర్వశిక్ష అభియాన్ 6, కార్మికశాఖ 1, పశుసంవర్ధక శాఖ 1, హార్టికల్చర్ 1, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 3, గ్రామీణ నీటి సరఫరా శాఖ 3, చేనేత,వస్త్రాలు 1, సైనిక్ వెల్ఫేర్ 1, నేషనల్ హైవే 1, డిసిహెచ్ఎస్ 8, ఉపాధి శాఖ 3.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఫిర్యాదుల పట్ల అలసత్వం వద్దు

చిత్తూరుఅర్బన్: ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా, వాటిని సమర్ధవంతంగా తీర్చాలంటూ అడిషనల్ ఎస్పీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీని కలిసి తమ సమస్యలను వినిపించారు. ఫిర్యాదులకు స్పందిస్తూ, బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలు పరిష్కరించాలంటూ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు అందాయి. కుటుంబ తగాదాలు 8, వేధింపులు 3, ఇంటి తగాదాలు 2, ప్రేమ వివాహం 1, భూ తగాదాలు 9, డబ్బు తగాదాలు 7, చిన్న తగాదాలు 3, ఆస్తి తగాదాలు 2, దారి తగాదాలు 2 ఉన్నాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

వినతులు వేగంగా పరిష్కరించాలి

చిత్తూరుఅర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 12 వినతులు వచ్చినట్లు కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 6, పింఛను 2, ప్రణాళిక విభాగం 2, ప్రజారోగ్య విభాగం 1, టిడ్కో 1 చొప్పున మొత్తం 12 వినతులు అందినట్లు తెలిపారు. ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

క్వారీ కోసం గ్రామస్తులపై దాడి

కలెక్టరేట్ ఎదుట రైతు కుటుంబాల నిరసన

చిత్తూరుఅర్బన్: తమ గ్రామంలోని పంట పొలాలపై అక్రమం క్వారీ తవ్వకాన్ని అడ్డుకున్నందుకు గ్రామస్తులపై అధికారపార్టీకి చెందిన యుగంధర్, అతని అనుచరులు తమపై దాడి చేశారంటూ వెదరుకుప్పం మండలం బందార్లపల్లి గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ పంట పొలాల సమీపంలో క్వారీ త్వవకాలు చేపడుతుంటడంతో బండరాళ్ళు పడి పంటలు దెబ్బతింటున్నట్లు చెప్పారు. 10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో క్వారీ కోసం పొలాల మధ్య దారి ఏర్పాటు చేయడంపై స్థానిక రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రెండు నెలలుగా క్వారీని రద్దు చేయాలని పోరాడుతున్నట్లు చెప్పారు. 7వ తేదీ సోమవారం క్వారీ నిర్వాహకులు తమపై దౌర్జన్యం చేసి కొందర్ని గాయపరిచినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని కోరారు.




కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సంపూర్ణ అక్షరాస్యతతోనే ప్రగతి సాధ్యం

- వయోజన విద్య డీడీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సంపూర్ణ అక్షరాస్యతతోనే రాష్ట్రం అన్ని రంగాలలో ప్రగతిని సాధిస్తుందని వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు మహమ్మద్ ఆజాద్ అన్నారు. సోమవారం 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కన్నన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వయోజన విద్య డిడి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అక్షరాస్యులు కావాల్సిన ఆవశ్యకత ఉందని, నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలోని 76,410 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చేందుకు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ, మెప్మా, డ్వామా శాఖల సమన్వయంతో అక్షరాస్యత కార్యక్రమాలు ప్రారంభం చేస్తున్నామని తెలిపారు. నిరక్షరాస్యులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అక్షరాస్యులుగా మారాలన్నారు. ప్రతి విద్యార్థి కూడా వారి కుటుంబంలో నిరక్షరాసులుగా ఉన్నవారికి చదువు చెప్పాలన్నారు. ప్రతి అక్షరాస్యత కేంద్రంలో ఒక వాలంటీర్‌కు పది మంది నిరక్షరాస్యులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ వాలంటీర్ల సహకారంతో నిరక్షరాస్యులు అక్షరాస్యులు కావాలన్నారు. విద్యార్థులకు వయోజన విద్య ఆవశ్యకత అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఉద్యోగి త్యాగరాజులు నాయుడుని సన్మానించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థుల చేత ర్యాలీని ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వయోజన విద్యా డిడి మహమ్మద్ ఆజాద్

పేదల ఇళ్లపై దాడి

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం పెనుమూరు మండలం దాసర్లపల్లి గ్రామప్రజలపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా 90 కుటుంబాలు నివాసం ఉంటూ, అన్ని రకాల ప్రభుత్వ సౌకర్యాలు ఏర్పాటు చేసుకుని వారు నివసిస్తున్నారని, అయితే ఒక అక్రమదారుడు ఆ స్థలంపై కన్నేసి దౌర్జన్యంగా ఖాళీ చేయించి ఆక్రమించుకోవాలని లీగల్ నోటిస్ పంపించడం దారుణమన్నారు. ఇంటి పన్ను, కరెంటు బిల్లులు, వాటర్ పన్నులు, వాటర్ చార్జ్‌లు అన్ని రకాల హక్కులు పొంది నివాసముంటున్న ప్రజలపై దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాలని స్థానిక అధికారులు చుట్టూ తిరిగినా పరిష్కారం చూపకపోవడం శోచనీయమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించి దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకుని కాలనీ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత గ్రామస్తులు

'రణభేరి' జాతాను విజయవంతం చేయండి: యుటిఎఫ్



రణభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈనెల 15 నుండి 19వ తేదీ వరకు జరిగే యుటిఎఫ్ 'రణభేరి' జాతాను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణి గండన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రణభేరి జాతా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన ఏఒక్క సమస్య పరిష్కారం కాలేదని, ఉపాధ్యాయులపై యాప్‌ల పనిభారం, పి-4, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్ష మూల్యాంకనం, ఆన్లైన్ అప్లోడ్, గ్రీన్ పాస్పోర్ట్ మొదలైన బోధనేతర పనులు పనిభారం విపరీతంగా ఉపాధ్యాయులపై మోపుతున్నారని, తద్వారా విద్యాబోధనకు ఆటంకంగా ఉందని తెలియజేశారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, డిఏలు విడుదల చేయాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లాలోని కుప్పంలో ఈనెల 15న యుటిఎఫ్ రణభేరి జాత ప్రారంభం అవుతుందని, తదుపరి 25న విజయవాడలో బహిరంగ సభ ద్వారా యుటిఎఫ్ రణభేరి జాతా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈబైక్ జాతలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాధ్యక్షులు ఎస్.రెహానా బేగం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌పి.బాషా, జిల్లా కార్యదర్శులు డి.ఏకాంబరం, ఎం.పార్థసారథి, భానుప్రకాష్, రాజేష్ కుమార్, సర్దార్, మధు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- కనిపించని డ్రైనేజీలు
- వీధులన్నీ బురదమయం
- రాకపోకలకు ఇబ్బంది
- ఆచూకీ లేని అధికారులు

ప్రజాశక్తి - గంగవరం: డ్రైనేజీలు లేకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లోనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించకపోవడంతో వారి బతుకులు అభివృద్ధికి నోచుకోవడం లేదు..గంగవరం మండలం దండపల్లి గ్రామంలో ఈ దుస్థితి నెలకొంది..

జీవనం అస్తవ్యస్తం

గంగవరం మండలం దండపల్లి గ్రామం మేజర్ పంచాయతీ.. ఈ గ్రామంలో 400 కుటుంబాలు ఉన్నాయి. మేజర్ పంచాయతీలో డ్రైనేజీలు లేకపోవడంతో గ్రామస్తులు బురద నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. వంట పాత్రలు తోమడం వల్ల వచ్చే మురుగునీరు, పిల్లలు, పెద్దలు స్నానం చేసే సమయంలో వచ్చే నీళ్లు ఇళ్ల ముందు వీధుల్లో ప్రవహిస్తోంది. వీధుల్లో మురుగునీరు రావడంతో విధిలేని పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చంటి పిల్లలు ఎక్కడ వీధులలో కెళ్లి బురద నీటిలో పడతారో అన్న భయం వేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని డ్రైనేజీలు

దండపల్లి మేజర్ పంచాయతీలో దిగువ వేమనపల్లి , ఎగువ వేమనపల్లి, నాగిరెడ్డిపల్లి, కురవపల్లి, జోగిండ్లు, తదితర గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామంలోనూ డ్రైనేజీలు లేవని పలుమార్లు అధికారులకు, నాయకులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని అంటున్నారు.

ఆచూకీ లేని అధికారులు

ఈ గ్రామంలో 400 కుటుంబాలు ఉన్నాయి. మేజర్ పంచాయతీ అయినా అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు అంటున్నారు. పంచాయతీ కార్యదర్శి కార్యాలయానికే పరిమితమై గ్రామంలో పర్యటించిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు వారంలో ఒకసారి గ్రామంలో పర్యటించి సమస్యలు గుర్తించి మండల అధికారులకు తెలపాల్సి వుంది. ప్రస్తుతం అధికారులు ఎవరూ గ్రామాలలో పర్యటించిన దాఖలాలు లేవు. ఇలా ఉంటే పై స్థాయి అధికారులకు, నాయకులకు గ్రామాల సమస్యలు ఎలా తెలుస్తాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రాకపోకలకు ఇబ్బంది

దళితవాడలో విద్యుత్ దీపాలు కూడా లేవని దీంతో రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే ఏ సమయానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ఆందోళన చెందాల్సి వస్తోందని పంచాయతీ వాసులు పేర్కొంటున్నారు. ఇన్ని సమస్యలు తిష్ట వేసి వున్నా అధికారులు ఏమీ తెలియనట్టు మౌనం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి డ్రైనేజీ లు ఏర్పాటు చేస్తే వృథా నీరు కాలువ ద్వారా వెళతాయని అంటున్నారు.



వీధిలోనే ప్రవహిస్తున్న మురుగునీరు

వీధుల్లో దుర్వాసన



వీధుల్లో మురుగు నీటికి తోడు పశువుల అధికంగా తిరుగుతుండడంతో మురుగు నీరు మరింత దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వీధుల్లో నీరు నిలిచి ఉండడంతో రాత్రి వేళల్లో దోమలు విపరీతంగా ఇళ్లలోకి చేరి పిల్లలను కరవడంతో రోగాలు బారిన పడాల్సి వస్తోంది. దీనిపై అధికారులకు పలుమార్లు అర్జీలు అందించినా ప్రయోజనం లేదు. మా గ్రామంలో డ్రైనేజీలు వేసి మురుగునీరు తప్పించాలి.

- జైపాల్ రెడ్డి, దండపల్లి గ్రామం.

చీకటి పడితే ఇళ్లకే పరిమితం



మా గ్రామంలో వీధిలైట్లు కూడా లేవు. చీకటి పడితే ఇళ్లకే పరిమితం అవుతున్నాం..తాను పదవు ల్లో ఉన్నప్పుడు అనేకమార్లు మండల స్థాయి అధికారులకు నాయకులకు సమస్యలు తెలిపాం.. అలా తెలిపినా ఎలాంటి ప్రయోజ నం లేదు. దళితవాడలో మరీ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

- శ్రీరాములు, మాజీ సర్పంచ్.

నాయకులు కనిపించరు..



ఎన్నికల సమయంలో గెలిపిస్తే గ్రామానికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తామని చెప్పిన నాయకులు ఇప్పటి వరకు కనిపించలేదు.. ఇళ్ల ముందే మురికి నీరు పారుతూ ఉంటే విధి లేని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాం.. పిల్లలను పాఠశాలకు పంపడానికి ఇంటిలో తప్పనిసరిగా ఒక మనిషి వారికోసం కేటాయించి వారి నెత్తుకుని పాఠశాల వరకు వెళ్లాల్సిందే.. అలాకాని పక్షంలో పిల్లలు మురికి నీటిలో పడి ఎక్కడ రోగాల పాలు అవతారో అనే భయం కలుగుతోంది.

- సుబ్రహ్మణ్యం నాయుడు, గ్రామస్తుడు.



సోమవారోత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

కోలాహలంగా సోమవారోత్సవాలు

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలోని వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్షికోత్సవాలలో భాగంగా రెండవ సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి పంచామృత అభిషేకం, ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా భాద్ర పదమాసంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు స్థానికంగానే కాకుండా, సహద్దుల్లోని కర్ణాటక, తమిళనాడుల నుండి సైతం వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ప్రసిద్ధి గాంచింది. భక్తుల సౌకర్యార్థంగా క్యూ లైన్లు ఏర్పాటు చేసి దర్శనం కల్పించి ఆలయ అభివృద్ధి కమిటీ వారు అన్నదానం చేశారు. వివిధ గ్రామాల నుండి భక్తులు కావళ్ళు మోసుకుంటూ, తేరులు లాగుతూ స్వామి దర్శనానికి వచ్చారు . భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకట మోహన్, పోలీసు సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

ప్రజాశక్తి- కుప్పం: టీచర్స్ డే సందర్భంగా హోం మంత్రి అనిత ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ అధికారిక పోస్టుపై అభ్యంతకర, మతపరమైన ద్వేషాన్ని రెచ్చ గొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ నేతలు కుప్పం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమే కాకుండా సామాజిక వర్గాల మధ్య విభేదాలు, మతపరమైన విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉందని అభ్యంతర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, ఎంఆర్‌పిఎస్ నేతలు కుప్పం సీఐ శంకరయ్యకు ఫిర్యాదు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -విజయపురం: స్థానిక మండలంలోని ఆలపాకం గ్రామంలో సోమవారం ముమ్మ రంగా పారిశుధ్య పనులు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని సైడు కాలువల్లో మురుగు పేరుకుపోయి నీటి పారుదల ఆగిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్ బాబు సైడు కాలువలలోని మురుగు, చెత్తా చెదారాన్ని తొలగించారు. దీనివల్ల మరిన్ని పారిశుధ్య సమస్యలు, తలెత్తకుండా ఉండడానికి అనంతరం గ్రామంలో దోమలు విజృంభించకుండా ముందస్తు జాగ్రత్త చర్యల భాగంగా గ్రామం అంతా బ్లీచింగ్ చల్లారు.

'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -సోమల:(సదుం): 'అన్నదాత పోరు' పోస్టర్‌ను పుంగనూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి నూతన కాలువ అనీషా రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడంలో అన్ని విధాల విఫలమయ్యారన్నారు. ఈనెల 9వ తేదీ మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీ లో రైతులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ వజ్ర భాస్కర్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, సదుం మండలం వైసీపీ కన్వీనర్ రెడ్డప్ప రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఎంపీపీ ఈశ్వరయ్య నియోజకవర్గం నాయకులు శివ, కిరణ్, ఆధ్వర్యంలో రైతు పోరు గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు శునకాలకు వైద్య శిబిరం

ప్రజాశక్తి -బంగారుపాలెం: పెంపుడు కుక్కలకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పశు వైద్య సహాయ సంచాలకులు ఆసిఫ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు వైద్య శిబిరం నిర్వహిస్తామని పెంపుడు కుక్కల యాజమాన్యులు వారి కుక్కలను ఆసుపత్రికి తరలించి చికిత్స చేసుకోవాలని కుక్కలకు నట్టల నివారణ కోసం ర్యాబీస్ రాకుండా ఉండేందుకు మందులను పంపిణీ చేయనున్నట్లు ఉత్తమ పెంపుడు కుక్కల నిర్వహణ చేపట్టే వారికి బహుమతులు పంపిణీ చేస్తామని ఈ వైద్య శిబిరాన్ని పెంపుడు కుక్కల యాజమాన్యాలు సదియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పలమనేరు శాఖ అధ్యక్షుడిగా రత్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గురుమూర్తి, ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఉన్న సంఘ కార్యవర్గ సభ్యుల కాల పరిమితి ముగియడంతో చిత్తూరు జిల్లా పెన్షన్ సంఘం అధ్యక్షులు నాగరాజ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆత్మానందం నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దశరథ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమ నాయుడుల ఆధ్వర్యంలో పలమనేరుకు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కుప్పంలోనే వాహన ఫిట్‌నెస్ తనిఖీలు చేపట్టాలి

ప్రజాశక్తి-కుప్పం:

ఎల్లో బోర్డు వాహనాలకు సంబంధించి వాహన ఫిట్నెస్ తనిఖీలను కుప్పంలోని ఆర్డీవో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కుప్పం లారీ అండ్ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కు వినతిపత్రం అందించారు. గతంలో వారానికి ఒక్కరోజు ఆర్టీఓ కుప్పంకు వచ్చి వాహన ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే వారు అని, ప్రస్తుతం చిత్తూరు జిల్లా బంగారుపాలెంకు మార్చడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కుప్పంలోనే వాహన ఫిట్‌నెస్ పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని లారీ అండ్ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ విజ్ఞప్తి చేశారు.



గురు పూజోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళిమోహన్

తరగతి గదులే ప్రయోగశాలలు:ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: తరగతి గదులే ప్రయోగశాలలు అని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు, సోమవారం మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో గురుపూజోత్సవం మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు ,రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గది ప్రయోగశాలలుగా సేవలందిస్తారని సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల కీలకమని అత్యున్నత పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతున్నారన్నారు. వారి సేవలు మరువ లేనివని పేర్కొన్నారు. పలువురు జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యా యులకు దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్ర నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు ధరణి ప్రసాద్ , ప్రధాన కార్యదర్శి జనార్ధన గౌడ్, ఉప సర్పంచ్ లోకనాథం నాయుడు, పలువురు ఉపాధ్యాయు ని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు చేయండి సారు..!

కడ పీడీకి వికలాంగుడి వినతి

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ, గడ్డురు గ్రామానికి చెందిన హనుమంతు వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని సోమవారం ప్రజా పరిష్కార వేదికలో కడ పీడీ వికాస్ మర్మత్ కు ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి వినతి పత్రం అందించారు. గత మూడు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు హనుమంతు కు కుడిచేయి విరిగిపోయింది. దీంతో ఆసుపత్రిలో 90 శాతం వికలాంగ సదరన్ సర్టిఫికెట్ పొందాడు. అప్పటినుంచి ప్రజా ప్రతినిధులు, అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయింది.చేయి లేకపోవడం తో జీవనం దూర్భారంగా మారిందని హనుమంతు వాపోయాడు.ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నేతలు కడ పీడీకి వినతి పత్రం సమర్పించడంతో ఆయన స్పందిస్తూ.. సంబంధిత అధికారులను పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్ వెంకటేష్, రాఘవేంద్ర, గోవిందప్ప, జయప్ప, పళని ,రాము పాల్గొన్నారు.

ఉమ్మడి డీఏ మంజూరు చేయండి..

ప్రజాశక్తి - యాదమరి:

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు పేర్కొన్నారు. మండలంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల సేకరణ సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు తమ సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు యాదమరి మండల శాఖ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్లై, సంఘ నాయకులు గుణశేఖరన్, గణపతి, భాషా, మణి రెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మామిడి రైతులకు ఉద్యాన అధికారి సూచన

ప్రజాశక్తి -పుంగనూరు:

మామిడి కాయల కోత అనంతరం కొమ్ముల కత్తిరింపులు అత్యంత ప్రధానమైన అంశం అని ఉద్యాన అధికారి వరప్రసాద్ అన్నారు. మామిడి పై ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను గురించి సోమవారం వివరించారు. దీని వల్ల మామిడి లో ప్రధాన సమస్య తేనె మంచు పురుగు, మంగు చాలా వరకు నియంత్రించవచ్చు అన్నారు. 15 శాతం దిగుబడి పెరుగుతుందని, కొమ్మలు కత్తిరించి బ్లిత్సో కానీ, బొర్డెక్స్ పేస్ట్ కానీ పూయాలన్నారు. 20 సంవత్సరాలు అంతకు పైబడిన తోటల్లో దిగుబడి పెంపునకు ప్రభుత్వం అంట్లు కట్టుకోడానికి రాయితీ అమలు చేస్తుందని తెలిపారు. రైతులు రాయితీ పొందేందుకు తమ వివరాలు ఉద్యాన అధికారులను లేదా రైతు సేవా సిబ్బందిని సంప్రదించాలన్నారు. విడి పూలు సాగు , కొత్తగా నాటిన పండ్ల తోటలు, బొప్పాయి అరటి, కాకర, బీర పంటలు, శాశ్వత పందిర్లు , ప్యాక్ హౌస్‌లు, , వ్యక్తిగత సామూహిక ఫారం పాండ్లుకు కూడా ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ చిన్న పోటు జేను గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బాలాజీ ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక య్యాడు. సోమవారం ఎంపిడివో కార్యాలయంలో టీచర్ బాలాజీ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, పుత్తూరు ఇన్‌చార్జి డివైఇవో మహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి దామోదరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితవాడలో అదుపులోకొచ్చిన జ్వరాలు

- నూట ఇరవై ఆరు కుటుంబాల సర్వే
- పారిశుధ్యం పనులు వేగవంతం



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల దళితవాడలో నాలుగు రోజుల క్రితం ప్రజలు జ్వరాల బారిన పడటంతో అప్రమత్తమైన వైద్య, పంచాయితీ సిబ్బంది మూడు రోజులుగా గ్రామంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేశారు. సోమవారం వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు గ్రామంలోని నూట ఇరవై ఆరు కుటుంబాల వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు ఎవరికీ లేవని అదుపులోకి వచ్చాయని అయినా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విశ్వమాలిని మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించామని, ఓవర్ హెడ్ ట్యాంకు రెండుసార్లు బ్లీచింగ్ నీటితో శుభ్రం చేశామని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్, సుధాకర్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ నుండి విముక్తి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని ఎట్టేరి సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో వెట్టిచాకిరీ చేస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాన్ని ఆర్డీఓ ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం విముక్తి కలిగించారు. మండల పరిధిలోని ఎట్టేరి ప్రాంతంలో పెనుమూరు మండలం పూనేపల్లికి చెందిన నందిని వారి కుటుంబ సభ్యులు ముగ్గురు సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ యజమాని వద్ద లక్ష రూపాయలు అప్పుగా పొందారు. ఈ అప్పులు తీర్చేందుకు గత ఏడాది నుంచి యజమాని నిర్బంధంలో ఉంచి వేధింపులకు గురి చేస్తున్నట్లు రోప్స్ అనే స్వచ్ఛంద సంస్థ కలెక్టర్ కు ఫిర్యాదు అందించింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ శ్రీనివాసులు ఫ్యాక్టరీని సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి విచారణ జరిపి నందిని, ఆమె ముగ్గురు పిల్లలను వెట్టిచాకిరీ నుండి కాపాడారు. సదరు విషయమై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో తమశీల్దారు సి కె శ్రీనివాసులు, ఏఎస్ఐ మురళి, రోప్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సిమెంటు, ఇటుకల ఫ్యాక్టరీ వద్ద విచారణ చేపట్టిన ఆర్‌డివో

'అన్నదాత పోరు'కు తరలిరండి: వైసిపీ

ప్రజాశక్తి- రామకుప్పం: ఎరువుల బ్లాక్ మార్కెట్ పై వైసిపి చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, వైసిపీ కార్యకర్తలు తరలిరావాలని వైసిపి మండల అధ్యక్షుడు బాబు రెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. రైతులకు ఎరువులు అందించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కుప్పం ఆర్డీవో కార్యాలయంలో రైతుల పక్షాన యూరియాతో సహా అవసరమైన ఎరువులను రైతులకు వెంటనే పంపిణీ చేయాలని వినతి పత్రం సమర్పిస్తామన్నారు. బ్లాక్ మార్కెట్ ను నియంత్రించాలని, పంట గిట్టుబాటు ధర, వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు రైతులకు వెంటనే పరిహారం తదితర వాటిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్కతుల్లా, రాజగోపాల్, అశోక్, గోవిందప్ప, యశ్వంత్, శ్రీనివాసులు, సురేందర్ రెడ్డి, నటరాజ్, సుధాకర్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

- కుప్పం ఏఎంసి ఛైర్మన్ జిఎం రాజు



ప్రజాశక్తి -కుప్పం: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతు సంక్షేమానికి కుప్పం ఏఎంసీ కమిటీ అహర్నిశలు పనిచేస్తుందని ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. కుప్పం ఏఎంసీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియాను సబ్సిడీపై అందిస్తామని రైతుల సైతం కరమైన యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై అధిక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ పథకాలను రైతులకు చేర్చేందుకు కుప్పం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఏఎంసీ డైరెక్టర్ల ఆధ్వర్యంలో క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రతి రైతు సమస్యను పరిష్కరించడం జరుగు తుందన్నారు. కుప్పం మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని రైతులు పండించిన నాణ్యమైన కూరగాయలకు వీకోట మార్కెట్తో పోలిస్తే పది నుండి 20 రూపాయలు అదనంగా వచ్చే విధంగా బయ్యర్లతో మాట్లాడి రైతులకు లబ్ధి చేకూరుస్తామన్నారు. కుప్పంలో రూ. 28 లక్షలతో సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుకు సీఎం మూడు రోజుల క్రితం నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే వైసీపీ కుటిల రాజకీయాల కోసం కుట్రలు పన్నుతోందంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్ పాల్గొన్నారు.

పిఎసిఎస్ ద్వారా ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఎరువులను పంపిణీ చేస్తామని ఆ సంఘ అధ్యక్షులు కె శ్రీరాములు అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కె శ్రీరాములు మాట్లాడుతూ మండల సహకార సంఘానికి ఫెర్టిలైజర్స్ లైసెన్సు మంజూరు అయిందని త్వరలో రైతులకు ఎరువుల అందుబాటులో కి తెచ్చి సరసమైన ధరలకు పంపిణీ చేస్తామని తెలిపారు. సంఘంలో తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించాలని, పాత బకాయిలను వెంటనే చెలించాలని కోరారు. పంట రుణాలు, వ్యవసాయ యేతర రుణాలు 5 లక్షల రూపాయల వరకు ఇస్తున్నామని, బంగారు తాకట్టు రుణాలపై 89 పైసల కు గ్రాముకు రూ.5500 నుండి రూ.6500 వరకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహకార సంఘం సిఈఓ ఎన్ రామరాజు, డైరెక్టర్లు ఓ గంగప్ప, పిహరినాథ్ పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని ఆరు పంచాయతీల పరిధిలోని రైతు సేవా కేంద్రాల లో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. సోమల, పెద్ద ఉప్పర పల్లి, ఆవులపల్లి, పొదలకుంటపల్లి, 81 చిన్న ఉప్పరపల్లి ,వల్లిగట్ల పంచాయతీలలోని రైతు సేవా కేంద్రాలలో పోలీసు బందోబస్తు మధ్య యూరియా రైతులకు పంపిణీ చేశారు. మండలంలో జరుగుతున్న యూరియా పంపిణీ సరళిని పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ అన్ని పంచాయతీలలో తిరిగి తనిఖీలు నిర్వహించి రైతులకు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్, ఎస్ఐ శివశంకర్, వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తవణంపల్లి: తవణంపల్లి మండలం లో రైతులకు ప్రభుత్వం మరొక సదుపాయం అందించింది. పట్నం, నల్లిసెట్టిపల్లి, సరకల్లు రైతు సేవ కేంద్రాల ద్వారా మొత్తం 535 మంది రైతులకు 24 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయబడింది.పట్నం కేంద్రంలో ఈ కార్యక్రమం లో తవణంపల్లి తహశీల్దారు సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు. సరకల్లు కేంద్రంలో వ్యవసాయ అధికారి జి ప్రవీణ్ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తయింది.


గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండ లంలోని వేపంజేరి, మహాదేవ మంగళం, వింజం, వీరక్క నెల్లూరు, రైతుసేవా కేంద్రాల్లో యూరియా పంపిణీని తహశీల్దారు శ్రీనివాసులు, జీడి నెల్లూరు మండల వ్యవసాయ అధికారిణి భవాని సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ అధికారి భవాని మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసు కోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ప్రవీణ్, రూహి ఫాతిమా, సచివాలయ సిబ్బంది రెడ్డప్ప, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీలో రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న యూరియాను సోమవారం అధికారులు, నేతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, శంకరచలం, మనేష్, షణ్ముగం, కృష్ణా రెడ్డి, శుభాష్, బీరప్ప, మురుగేష్, లోకేష్ ,నవీన్, రైతులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: వ్యవసాయ అధికారి గీతా కుమారి సీఐ పరశురాముడు ఆధ్వర్యంలో మండలంలో రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. నెల్లిపట్ల చప్పిడిపల్లి, బైరెడ్డిపల్లి టు తీర్థం, గొల్లచిమనపల్లి, పిసిగుంట, లక్కనపల్లి, పంచాయతీలలో యూరియా అందించారు.

అరకొర యూరియా పంపిణీ

- పలుచోట్ల రైతుల ఇబ్బందులు



రైతు సేవా కేంద్రం వద్ద తోపులాట చోటు చేసుకున్న దృశ్యం

చౌడేపల్లి: మండలంలో సోమవా రం నిర్వహించిన యూరి యా పంపిణీ రసాభాసగా మారింది. పలుచోట్ల రైతులు క్యూ లైన్లలో లేకుండా తోపులాట చోటు చేసుకుంది. అరకొర యూరియా పంపిణీ చేయడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపించారు. మండల వ్యాప్తంగా ఉన్న 12 రైతు భరోసా కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో 150 బస్తాలు మాత్రమే రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. అయితే ప్రతి రైతు భరోసా కేంద్రంలో అంతకు మించి రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొని క్యూలైన్లో వేచి ఉన్నారు. ఎక్కడ తమకు రాకుండా పోతుందో నని క్యూలైన్లలో అక్కడక్కడ తోపులాటలు చోటుచేసు కున్నా యి. దుర్గ సముద్రం లద్దిగాం రైతు భరోసా కేంద్రాల వద్ద తీవ్రస్థాయిలో తొక్కిసలాట జరిగింది. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తహశీల్దారు పార్వతి, ఏవో మోహన్ కుమార్ కేంద్రాల వద్దకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

తండ్రికి గాయాలు



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌పురం మండలంలో సోమవారం చోటు చేసుకుంది స్థానికుల కథనం మేరకు.. ఎస్ఆర్ పురం మండలంలోని తయ్యూరు గ్రామ పంచాయతీ పెద్దతయ్యూరు గ్రామానికి చెందిన ఖాదర్ బాషా , అతని కుమారుడు వసీం(4) కలిసి కొత్తపల్లి మిట్ట వెళ్లి తిరిగి వస్తుండగా చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారి మంగుంట రోడ్డు దగ్గర స్కూటర్ అదుపుతప్పి డివైడరును ఢీ కొంది. దీంతో వసీం అక్కడికక్కడే మృతి చెందాడు. ఖాదర్ బాషా పోలీస్ వాహనంలో పక్కనున్న ఆరిమాకులపల్లి ఆరోగ్య కేంద్రానికి ప్రథమ చికిత్స కోసం ఎస్ఐ సుమన్ తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారి మృతితో ఆ గ్రామం శోకసముద్రంలో మునిగింది.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బంగారుపాలెం:

ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని కుప్పలపల్లి సమీపంలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సమాచారం మేరకు చిత్తూరు రూరల్ మంగ సముద్రం గ్రామానికి చెందిన అబ్దుల్ సమీర్ కుమారుడు ముస్తఫ్ 44 పాత వస్తువులు కొనుగోలు చేసేందుకు సంక్రాంతి పల్లె నుండి కుప్పాలపల్లికి వెళ్లే దారిలో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అదుపుతప్పి చెరువులో నీటి కుంటలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి -విజయపురం: స్థానిక మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలకు పూర్వ విద్యార్థి రాజేంద్రరావు బీరువాను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు మాట్లాడుతూ దాతల సాయంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దాత రాజేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, తోటి విద్యార్థులపట్ల స్నేహభావం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో జయదేవరాజు, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, సుజాత గ్రామస్తులు సురేష్, గజేంద్ర, వినీత పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్వేటినగరం ప్రాజెక్టు సిడిపిఓ శోభారాణి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిశోర బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ , పోక్సో యాక్ట్ , ఉమెన్ సేఫ్టీ పలు అంశాలపై పిల్లలకు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర వైజర్ రోజా రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ , దేశమ్మ, శ్రీదేవి, హేమ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ తనిఖీ

సోమల (సదుం): మండల కేంద్రమైన సదుం రైతు సేవా కేంద్రం1లో సోమవారం రైతులకు పంపిణీ చేస్తున్న యూరియా పంపిణీని తహశీల్దారు ప్రమీల, ఎంపీడీవో సురేష్ బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం , వ్యవసాయ శాఖ సిబ్బంది మంజుల, రైతులు పాల్గొన్నారు.

రఘుపతికి ఘన నివాళి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల ఆంధ్రనాడు విలేకరి జి శ్రీనివాసులు తండ్రి జి రఘుపతి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి వార్త విని పచారమాకుల పల్లి గ్రామానికి చేరుకున్న పలువురు ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బైరెడ్డిపల్లి మండల టిడిపి అధ్యక్షులు బిఎం రాధ కిశోర్ గౌడు, పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడు, దేవదొడ్డి టిడిపి సీనియర్ నాయకులు రమేష్ కలిసి రఘుపతి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి -పుంగనూరు: అనాథ మృతదేహానికి అంత్యక్రి యలు చేసి మానవ త్వాన్ని చాటుకు న్నారు ఏఎస్ఐ.. ఈ ఘటన పుంగనూరు మున్సిపాల్టీలో సోమవారం చోటు చేసుకుంది. ఓ అనాథ వృద్ధ మహిళ చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించేది. అనారోగ్యంతో బస్టాండ్ సమీపంలో సంత గేటు వద్ద మృతి చెందింది. పోలీసులకు విషయం తెలియడంతో ఏఎస్ఐ అశ్వర్థ నారాయణ సొంత ఖర్చులతో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎస్ఐ